సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శుక్రవారం । 3 । జనవరి । 2025



మాజీ ఎమ్మెల్యే స్థలం అక్రమ రిజిస్ట్రేషన్

ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే పాణ్యం యర్ర మునిరెడ్డికి చెందిన స్థలాన్ని.. నకిలీ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేయించుకున్న సంఘటన చోటు చేసుకుంది. -8లో



ఆగిన చదువు సాగేలా.. అందలానికి చేరేలా..

చదువును మధ్యలో మానేసిన, ఉత్తీర్ణులు కాలేకపోయిన వారి విద్యాసక్తి నెరవేర్చేందుకు.. ఓపెన్ స్కూల్ ఒక వరం. -8లో

గరిష్టం/కనిష్టం
30.7/19.9

వాతావరణం

జిల్లాలో గురువారం 19.9 - 30.7 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

రేపు కడపలో 'యాదే రఫీ'



కడప కల్చరల్: ప్రముఖ గాయకుడు, దివంగత మహమ్మద్ రఫీ శత జయంతి సందర్భంగా ఈనెల 4వ తేదిన యాదె రఫీ పేరుతో మ్యూజికల్ ట్రిబ్యూట్ నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. కడపనగరం అగాడిలోని సంఘం ఫంక్షన్ హాలులో నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయకులు అబ్దుల్ కలాం, షమీన్, రఫీక్, ఆరీఫ్‌లు తమ గాన మాధుర్యాన్ని ప్రేక్షకులకు వినిపిస్తారన్నారు. అమర గాయకుడు మహమ్మద్ రఫీని అభిమానించే ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

నేడు ఏకసభ్య కమిషన్ జిల్లాకు రాక

కడప సెవెన్‌రోడ్స్: షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్ వర్గీకరణపై ఫిర్యాదులు స్వీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్ శుక్రవారం జిల్లాకు వస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వరనాయుడు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జిల్లాకు చేరుకుంటారని తెలిపారు. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు జిల్లా అధికార యంత్రాంగంతో సమావేశం నిర్వహించడంతోపాటు కలెక్టరేట్ సభా భవనంలో వివిధ ఉప కులాల సభ్యులు, సంఘాల వినతి పత్రాలు స్వీకరిస్తారని చెప్పారు. మధ్యాహ్నం 3.30 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి నెల్లూరు జిల్లాకు వెళతారని వివరించారు.


స్టాఫ్ నర్స్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కడప రూరల్: వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్-4 పరిధిలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన స్టాఫ్ నర్స్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని ఆ శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రామగిడ్డయ్య తెలిపారు. 150 స్టాఫ్ నర్స్ ఉద్యోగాల భర్తీకి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు నమూనాను సీఎస్‌డబ్ల్యు.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. భర్తీ చేసిన దరఖాస్తుతో పాటు నిర్దేశించిన రుసుము, సంబంధిత సర్టిఫికెట్లను జతపరిచి ఈనెల 3 నుంచి 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు కడప పాత రిమ్స్‌లో గల వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

కడప సెవెన్‌రోడ్స్: భూ సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో భాగంగా శుక్రవారం జిల్లాలోని 26 గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వరనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. బద్వేలు రెవెన్యూ డివిజన్‌లోని ముత్తుకూరు, తంగెడుపల్లి, నాగిశెట్టిపల్లె,ఎగువ తంబళ్లపల్లె, అక్కంపేట, పోరుమామిళ్లలో సద్సులు జరగనున్నాయి. పులివెందుల రెవెన్యూ డివిజన్‌లోని చక్రాయపేట, భద్రంపల్లి, నరసింగరావు పల్లె, హిమకుంట, రాచమర్రిపల్లిలో, జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్‌లోని పర్లపాడు, రామేశ్వరం, నక్కవానిపల్లె, భూతమపురం, శివపురం, పొట్లదుర్తి, ఎస్.ఉప్పలపాడు, చిన్న దుద్యాల, పెద్దదుద్యాల, చిన్న సింగనపల్లె, వెదురూరులో సదస్సులు జరుగుతాయి. కడప రెవెన్యూ డివిజన్‌లోని పెద్దసరిపల్లె, సీకే దిన్నె మండలం బుగ్గలేటిపల్లి, పొడదుర్తి, కొక్కరాయపల్లితో కలిపి మొత్తం 26 గ్రామాలలో రెవెన్యూ సదస్సులు జరుగనున్నాయని డీఆర్వో వివరించారు.

5న హాకీ బాలుర జట్టు ఎంపికలు



పులివెందుల టౌన్: జిల్లా బాలుర జూనియర్, సబ్ జూనియర్ హాకీ జట్ల ఎంపికలు ఈనెల 5వ తేదీన పులివెందులలోని వైఎస్ఆర్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ అకాడమీలో ఆదివారం ఉదయం 9గంటల నుంచి జరగనున్నట్లు హాకీ కడప జిల్లా సెక్రటరీ ఎం.శేఖర్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇక్కడ ఎంపికైన సబ్ జూనియర్ బాలుర జట్టు ఈనెల జనవరి 17వ తేదీ నుంచి 19వ తేదీ వరకు మదనపల్లెలో జరిగే 14వ రాష్ట్రస్థాయి బాలుర సబ్ జూనియర్ చాంపియన్ షిప్‌లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఈ ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు కచ్చితంగా 2009జనవరి 1వ తేదీ తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. అదేవిధంగా జూనియర్ విభాగంలో ఎంపికైన బాలుర జట్టు ఈ నెల రెండవ వారంలో కాకినాడలో జకిగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర చాంపియన్ షిప్‌లో పాల్గొంటారని, ఈ ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు కచ్చితంగా 2006 జనవరి 1వ తేదీ తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఎంపికలలో పాల్గొనే జూనియర్, సబ్ జూనియర్ క్రీడాకారులు ఆధార్, బర్త్ సర్టిఫికెట్లను తీసుకుని రావాలన్నారు.

● కోటలు దాటిన మాటలు...

గడప దాటని హామీలు!

- మరుగున పడిన ఎమ్మెల్యే మాధవిరెడ్డి మేనిఫెస్టో
- ఆర్నెళ్లలో అభివృద్ధి అంటూ టీడీపీ ప్రత్యేక హామీలు
- కడప ఎమ్మెల్యే మాట ఇచ్చి మర్చిపోయారంటున్న నగర వాసులు



సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో మాధవిరెడ్డి, టీడీపీ నేతలు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కడప: కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి మాటల్లో చంద్రబాబును మించిపోయారు. శుష్క వాగ్దానాలతో ప్రజలను మోసం చేసి గెలిచిన కూటమి ప్రభుత్వ బాటలోనే ఎమ్మెల్యే కూడా నడుస్తున్నారు. నియోజకవర్గ ప్రజలకు ప్రత్యేకమైన మేనిఫెస్టో అంటూ హామీలిచ్చిన ఆమె, ఆ తర్వాత వాటి ఊసే మర్చిపోయారు. సొంత నిధులతో కడపలో ఎన్నెన్నో చేస్తానని ఇచ్చిన హామీలకు ఏడు నెలలు గడుస్తున్నా అతీగతీ లేకుండా పోయింది.

● ఎన్నికల్లో గెలవడానికి కూటమి ప్రభుత్వం అలవిగాని హామీలిచ్చింది. సూపర్ సిక్స్ పేరిట అనేక వాగ్దానాలు చేసింది. ఇక కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి మరో అడుగు ముందుకు వేసి తన సొంత మేనిఫెస్టో అంటూ విడుదల చేసి ఇంటింటికీ పంచారు. కొన్ని పనులకైతే తమ సొంత నిధులను ఖర్చు చేస్తామని, అదీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో పూర్తి చేస్తామంటూ మాటలు కోటల్ని దాటించారు. ఏడు నెలలు గడుస్తున్నా హామీలు గడప దాటడం లేదు.

కడప గడప అభివృద్ధి వైఎస్ కుటుంబం చలువే

మున్సిపాలిటీగా ఉన్న కడపను కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేసి అభివృద్ధిని పరుగులు పెట్టించారు నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి. ఆ తర్వాత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. కడపలో కనిపిస్తున్న ప్రతి ఒక్క అభివృద్ధి పనులు ఆ తండ్రీ కొడుకులు చేసినవే. మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా, మేయర్ సురేష్‌బాబు కోట్లాది రూపాయాల నిధులు తీసుకువచ్చి కడపను అభివృద్ధివైపునడిపారు.

డైవర్షన్ రాజకీయాలు..

ఎమ్మెల్యే మాధవీరెడ్డి తానిచ్చిన హామీలను పక్కన బెట్టి డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపుతున్నారు. కడపలో తాగునీటి సమస్యకు పరిష్కారం లేదంటూ మాట్లాడుతూ కాలం గడుపుతున్నారు. బ్రహ్మంసాగర్ నుంచి కడపకు తాగునీటి ప్రాజెక్టును వైఎస్ జగన్ ప్రభుత్వం మంజూరు చేస్తే ఆ పనులనూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత చేయించడం ఆమెకు చేతకాలేదనే విమర్శలు తెరపైకి వచ్చాయి. ఓ వైపు తానిచ్చిన వాగ్దానాలను అమలు చేయకపోవడం, మరో వైపు వైఎస్ జగన్ సర్కార్ మంజూరు చేసిన పనులను కూడా కొనసాగించకపోవడంపై ప్రజలు తప్పు పడుతున్నారు.

▶▶ సీసీ కెమెరా ఏర్పాటు హామీ ఏమైందో!



ప్రతి వీధిలో సొంత నిధులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తానని మాధవి హామీ ఇచ్చారు. అందుకు రూ.50లక్షలు వెచ్చించనున్నట్లు ప్రకటించారు. 7నెలలు గడిచాయి.. సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తానన్న మాటలు గాలిలో కలిశాయి. ప్రతి పేద కుటుంబానికి సొంత నిధులతో 5 లక్షల బీమా చేయిస్తానన్నారు. నగర వ్యాప్తంగా మహిళలకు ప్రత్యేక టాయిలెట్లు ఏర్పాటు చేస్తానన్న మాట ఒక మహిళగా ఆమెకు గుర్తులేదు. సొంత డబ్బులతో కడపలో యువతకు ఉపాధి శిక్షణ సంస్థ ఏర్పాటు చేసి ఐదేళ్లలో 10వేల మందికి ఉద్యోగాలన్నారు. ఆ శిక్షణ సంస్థ మాటే ఇప్పుడు ఆమె నోటివెంట రావడం లేదు. ఇలా ఎన్నో హామీలు ఇచ్చిన ఆమె వాటి గురించి మాట్లాడం లేదు. ఎంతసేపు కార్పొరేషన్ పాలకమండలి సమావేశంలో కుర్చీ వేయలేదని రాద్ధాంతం చేస్తున్నారని.. లేని ప్రొటోకాల్ కోసం పాకులాడుతున్నారని పరిశీలకులు విమర్శిస్తున్నారు.

▶▶ షామీరియా మసీదు బ్రిడ్జి నిర్మాణం ఊసే లేదు

నగరం మధ్యలోంచి వెళ్లే బుగ్గవంకపై డాక్టర్ వైఎస్సార్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాలు ఆరు వంతెనలను నిర్మించాయి. మరో రెండు వంతెనలను కూడా వైఎస్ జగన్ ప్రభుత్వం మంజూరు చేసింది. ఆపై కోడ్ రావడంతో పనులు ఆగిపోయాయి. ఆ పనులు పూర్తి చేయించే బాధ్యత తాను తీసుకుంటానని.. అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లో షామీరియా మసీదు వద్ద బ్రిడ్జి పూర్తి చేస్తామని మాధవిరెడ్డి ప్రకటించారు. అవసరమైతే సొంత నిధులు సైతం వెచ్చిస్తానని హామీ ఇచ్చారు. ఆ తర్వాత ఆ మాటే మరుగున పడింది. మాజీ సీఎం వైఎస్ జగన్ మంజూరు చేసిన నిధులు సైతం కూటమి ప్రభుత్వం నుంచి తీసుకురావడంలో వైఫల్యం చెందారని పలువురు ఆరోపిస్తున్నారు.



గుర్రాల గడ్డ నుంచి రవీంద్ర నగర్‌కు వెళ్లే బ్రిడ్జి రహదారి

పింఛన్లు ఇవ్వడం తప్ప చేసిందేమీ లేదు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పింఛన్లు ఇవ్వడం తప్ప మరే హామీని అమలు చేయలేదు. ఎమ్మెల్యే మాధవి కడపను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని హామీలు గుప్పించారు. కానీ ఒక్కటంటే ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. కార్పొరేషన్ మీటింగ్‌లో కుర్చీ కోసం ఆమె చేసిన పోరాటం అభివృద్ధిపై చేసి ఉంటే కొంతమేర అయినా ప్రజలకు ప్రయోజనం కలిగేది. – పత్తి రాజేశ్వరి, కో ఆప్షన్ సభ్యురాలు, నగర పాలక సంస్థ

ఎన్నికల ముందు చూపిన కాలువలు, రోడ్లను బాగు చేయండి



ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే మాధవి ఎక్కడ కాలువ బాగా లేకపోయినా, రోడ్డు బాగా లేకపోయినా వాటిని సోషల్ మీడియాలో పోస్టు చేసి కడప అభివృద్ధి ఇదేనా? అంటూ ప్రచారం చేశారు. ప్రజలు నమ్మకంతో ఆమెకు ఓట్లు వేసి గెలిపించారు. ఆమె చూపిన కా లువలు, రోడ్లనైనా బాగు చేసి ఉంటే ప్రజలు హర్షించేవారు.

– టీపీ వెంకట సుబ్బమ్మ, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు

ఎమ్మెల్యే ఒక్క హామీ నెరవేర్చలేదు



ఎన్నికలకు ముందు టీడీపీ మేనిఫెస్టోతో పాటు ఎమ్మెల్యే మాధవి ప్రత్యేకంగా తన సొంత మేనిఫెస్టో తయారు చేసి ప్రచారం చేశారు. ఏడు నెలలు కావస్తున్నా అందులో ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. బుగ్గవంకపై రవీంద్రనగర్–నాగరాజుపేట బ్రిడ్జిలకు తాము రూ.20 కోట్లు మంజూరు చేయించి టెండర్లు పూర్తి చేసి భూమి పూజ చేశాం. కాంట్రాక్టర్ తండ్రి మృతి చెందడంతో ఆ పనులు ఆలస్యమయ్యాయి. ఆలోపు ఎన్నికల కోడ్ వచ్చి పనులు ఆగిపోయాయి. ఎన్నికల ఫలితాలు వచ్చాక ఎమ్మెల్యే మాధవి ఆ పనులకు తిరిగి టెంకాయ కొట్టి ఆరు నెలల్లోపు పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇప్పటికీ తట్టెడు మట్టి కూడా ఎత్తలేదు. కడపకు నీటి సమస్యను శాశ్వతంగా దూరం చేసేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బ్రహ్మంసాగర్‌తో 1.5 టీఎంసీల నీటిని కేటాయించి రూ.540 కోట్లతో పైపులైన్ నిర్మించేందుకు టెండర్లు పూర్తి చేసినా ఆ పనులు మొదలు పెట్టలేదు. మనసులో కక్ష పెట్టుకుని వైఎస్సార్‌సీపీ నాయకులను ప్రలోభాలకు గురిచేస్తూ సొంత అజెండా అమలు చేస్తున్నారు. – ఎస్‌బీ అంజాద్‌బాషా, మాజీ డిప్యూటీ సీఎం

ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి నిధులు తేలేదు



కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు పూర్తయింది. ఈనెల 4వ తేదికి ఏడు నెలలు పూర్తవుతాయి. ఈ ఏడు నెలల్లో కడప ఎమ్మెల్యే మాధవి నియోజకవర్గ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి నిధులు తెచ్చిన పాపాన పోలేదు. ఎన్నికల ముందు ఏవేవో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కటంటే ఒక్క హామీ కూడా అమలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు.

– కె.సురేష్‌బాబు, నగర మేయర్, కడప

కొనసాగుతున్న కానిస్టేబుల్ ఎంపికలు



పరుగుపందెంలో పాల్గొన్న అభ్యర్థులు

కడప అర్బన్: పోలీసు కానిస్టేబుళ్ల ఎంపికలు పకడ్బందీగా సాగుతున్నాయి. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాకు సంబంధించి ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు కడప నగర శివార్లలోని జిల్లా పోలీసు శిక్షణా కేంద్రం (డి.టి.సి)లో దేహదారుఢ్య పరీక్షలు 3 రోజు గురువారం కొనసాగాయి. ఈ సందర్భంగా డీటీసీలో ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు దేహదారుఢ్య సామర్థ్య పరీక్షలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దేహదారుఢ్య పరీక్షల దగ్గర ఎలాంటి ఆరోపణలు, పొరపాట్లకు తావులేకుండా ఆధునిక ఆర్.ఎఫ్.ఐ.డి కంప్యూటరైజ్డ్ టెక్నాలజీతో పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్‌బాబు, ఏఆర్ అదనపు ఎస్పీ బి. రమణయ్య, డీఎస్పీలు, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్ఎస్‌ఐలు, ఐటీకోర్ టీం ఉన్నారు.

341 మంది అభ్యర్థుల హాజరు: మూడవరోజు దేహదారుఢ్య పరీక్షలకు గురువారం 600 మంది అభ్యర్థులకుగాను 341 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 211 మంది అర్హత సాధించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

రాయచోటి: అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణం మదనపల్లె మార్గం సమీపంలో అక్రమరవాణాకు సిద్ధం చేస్తున్న పీడీఎస్ బియ్యం ప్యాకెట్లను ఎస్పీ స్పెషల్ పార్టీ పోలీసులు గురువారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. మదనపల్లె మార్గంలో ఉన్న షామీర్ కల్యాణ మండపం సమీపంలోని నివాసగృహంలో పక్క రాష్ట్రాలకు తరలించేందుకు సిద్ధం చేస్తుండగా 210 బియ్యం ప్యాకెట్లతో పాటు రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా పర్యవేక్షణ చేస్తున్నట్లు సమాచారం. శుక్రవారం ఉదయం రెవెన్యూ అధికారులకు అప్పగించి తదుపరి విచారణను కొనసాగించేలా చర్యలు తీసుకుంటామని బియ్యం పట్టుకున్న అధికారులు తెలిపారు

సైన్సు సంబరానికి వేళాయె!

- జిల్లాస్థాయి పోటీలకు 108 ప్రాజెక్టులు ఎంపిక
- నేడు కడప మున్సిపల్ హైస్కూల్‌లో జిల్లాస్థాయి ప్రదర్శన

కడప ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్ ఒక గొప్ప వేదిక. 2024-25 విద్యా సంవత్సరానికిగాను జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో సైన్సు ప్రాజెక్టుల ప్రదర్శనకు రంగం సిద్ధమయింది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఈ ప్రాజెక్టుల ప్రదర్శనలో పాల్గొననున్నారు. గత నెల డిసెంబర్ 20వ తేదీ పాఠశాల స్థాయిలో, 28న మండలస్థాయి పోటీలు జరిగాయి. ఇందులో వ్యక్తిగత ప్రాజెక్టులు, గ్రూపు ప్రాజెక్టులు, టీచర్ ప్రాజెక్టుల ప్రదర్శనను నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతి మండలం నుంచి మూడు కేటగిరీల్లో విజేతలను ప్రకటించారు. ఈ మూడు కేటగిరీలకు సంబంధించిన వారు శుక్రవారం కడపలో నిర్వహించే జిల్లాస్థాయి సైన్సు ఫెయిర్ పోటీల్లో పాల్గొనున్నారు.



జిల్లాస్థాయి పోటీలకు వేదిక కానున్న మున్సిపల్ హైస్కూల్ మెయిన్

కడపలో జిల్లాస్థాయి సైన్సు ప్రదర్శన...

మండలానికి 3 ప్రాజెక్టుల చొప్పున ఎంపిక చేసిన 108 ప్రాజెక్టులు శుక్రవారం కడపలోని మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో నిర్వహించే జిల్లాస్థాయి సైన్సుఫెయిర్‌లో ప్రదర్శితం కానున్నాయి. జిల్లాస్థాయి సైన్సుఫేర్ పోటీలను ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు నిర్వహించనున్నారు. ఈ ప్రాజెక్టులను జ్యూరీ సభ్యులు పరిశీలించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. ఇందులో వ్యక్తిగత విభాగం నుంచి రెండు ప్రాజెక్టులు, గ్రూపు విభాగం నుంచి రెండు ప్రాజెక్టులు, టీచర్ ఎగ్జిబిట్స్ నుంచి రెండు ప్రాజెక్టుల రాష్ట్రస్థాయి సైన్సు ఫెయిర్‌కు ఎంపిక చేయనున్నారు.

నేటి నుంచి మాచుపల్లె దర్గా ఉరుసు

సిద్దవటం: మండలంలోని మాచుపల్లె గ్రామ సమీపం ఉన్న హజరత్ సయ్యద్ షావలి దర్గాలో శుక్రవారం నుంచి ఉరుసు మహోత్సవం జరుగుతుంది. ఈ విషయాన్ని దర్గా కమిటీ ముజావర్ సయ్యద్ సలావుద్దీన్ గురువారం తెలిపారు. శుక్రవారం రాత్రి 9 గంటలకు గంధం మహోత్సవాన్ని పూల చాందినీలో ఊరేగిస్తారన్నారు.అనంతరం ఫాతేహా నిర్వహిస్తారన్నారు. శనివారం రాత్రి ఉరుసు కార్యక్రమం ఉంటుందన్నారు. ఉరుసు రోజు మధ్యాహ్నం, రాత్రి వేళల్లో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నారపురెడ్డి శ్రీనివాసులరెడ్డి అధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఆదివారం ఉదయం తహలీల్ ఫాతెహా జరుతుందని చెప్పారు. అందరూ ఉరుసు మహోత్సవంలో పాల్గొనాలని దర్గా కమిటీ ముజావర్ సయ్యద్ సలావుద్దీన్ కోరారు.

అంగన్వాడీలకు పుస్తకాలు చేరిక



పుస్తకాలతో అంగన్వాడీ కార్యకర్తలు

సాక్షి ఎఫెక్ట్..

కడప కోటిరెడ్డిసర్కిల్: అంగన్వాడీ కేంద్రాలకు ఎట్టకేలకు పుస్తకాలు చేరాయి. కూటమి ప్రభుత్వంలో చిన్నారులకు పుస్తకాలు అందక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఇటీవల 'మరీ అంత అలుసా' శీర్షికతో సాక్షి టాబ్లాయిడ్‌లో కథనం ప్రచురించింది. ఈ కథనానికి స్పందించిన ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలకు పుస్తకాలను సరఫరా చేసింది. కడప-1 ప్రాజెక్టు నుంచి పీపీ1, పీపీ2 పుస్తకాలు అందడంతో వాటిని చిన్నారులకు అందజేశారు. పుస్తకాల పంపిణీలో సీడీపీఓ శోభారాణి, సూపర్‌వైజర్లు రేణుక, దీప, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

8న జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశం ఈనెల 8వ తేది ఉదయం 10 గంటలకు జెడ్పీ కార్యాలయంలో జరుగుతుందని ముఖ్య కార్యనిర్వహణాధికారి ఓబులమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, అధికారులు స్థాయీ సంఘ సమావేశాలకు హాజరు కావాలని కోరారు.

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధే ఆకాంక్ష

- కేంద్ర శాస్త్ర సాంకేతిక భూ శాస్త్ర మంత్రి జితేంద్ర సింగ్
- జిల్లాలోని సీకేదిన్నె,జమ్మలమడుగు మండలాల్లో పర్యటన



కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా అభివృద్ధి గురించి కేంద్రమంత్రి జితేంద్రసింగ్‌కి వివరిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, చిత్రంలో ఎమ్మెల్యేలు చైతన్య, ఆది



సీకేదిన్నెలో రైతులు సాగు చేసిన వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి జితేంద్రసింగ్

కడప సెవెన్‌రోడ్స్/చింతకొమ్మదిన్నె/జమ్మలమడుగు: వెనుకబడిన ప్రాంతాల్లో అభివృద్ధి జరగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని.. ఆ దిశగా అధికారులు కృషి చేయాలని కేంద్ర శాస్త్ర సాంకేతిక భూ శాస్త్ర మంత్రి జితేంద్ర సింగ్ అన్నారు. ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని, ప్రతి మహిళ ఒక పారిశ్రామికవేత్తగా ఎదగాలన్నదే తమ లక్ష్యమని మంత్రి తెలిపారు. యాస్పిరేషనల్ బ్లాక్ కింద జిల్లాలో ఎంపికైన సీకే దిన్నె, జమ్మలమడుగు మండలాల్లో గురువారం మంత్రి పర్యటించారు.

ఆకాంక్ష బ్లాక్‌ల అభివృద్ధిపై కేంద్రీకరణ

ఆకాంక్ష జిల్లాలోని బ్లాక్‌ల అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించి పనిచేస్తున్నామని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. కలెక్టరేట్‌లో కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్‌కు జిల్లాలో జరుగుతున్న కార్యక్రమాల గురించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఆకాంక్షిత జిల్లా కార్యక్రమం కింద ఆరోగ్యం- పౌష్టికాహారం, విద్య, వ్యవసాయం, జల వనరులు, ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్, ప్రాథమిక మౌలిక వసతులు తదితర అంశాలలో జరుగుతున్న ప్రగతిని గురించి తెలిపారు. వ్యవసాయం ద్వారా జీవీఏ 16,817 కోట్లు, పారిశ్రామికరంగం వాటా 12,975 కోట్లు, సర్వీసు సెక్టార్ ద్వారా 18,756 కోట్లు ఉందని వివరించారు. చేనేత వస్త్ర పరిశ్రమను ప్రోత్సహించేందుకు మైలవరంలో టెక్స్‌టైల్ పార్కు, మాధవరం హ్యాండ్‌లూమ్ క్లస్టర్ ఏర్పాటు చేశామన్నారు. ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన కింద జరుగుతున్న కార్యక్రమాలను వివరించారు.

సీకే దిన్నెలో పర్యటన

కేంద్ర మంత్రి సీకే దిన్నె మండలం నాగిరెడ్డిపల్లె, బుగ్గలపల్లె గ్రామాలను సందర్శించారు. విలేజ్ హెల్త్ క్లినిక్ (ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్)ను సందర్శించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది అందుబాటు, మందుల స్టాకు వివరాలు, ఓపీ నమోదు సంఖ్య వంటివి అడిగి తెలుసుకున్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పనితీరును ఆయన ప్రశంసించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి గర్భిణులు, బాలింతలు, పసి పిల్లల పోషణపై ఆరా తీశారు.బుగ్గలపల్లె గ్రామంలో కౌలు రైతు ప్రభావతి సాగు చేసిన వంకాయ తోటను పరిశీలించారు. అలాగే పందిళ్ల ద్వారా సాగు చేస్తున్న సొరకాయ పంటను పరిశీలించారు. అలాగే రైతు గుత్తిరెడ్డి శివారెడ్డి డ్రిప్ ద్వారా సాగు చేసిన అరటి తోటను సందర్శించారు. నమో డ్రోన్ దీది లబ్ధిదారుతో మాట్లాడిన కేంద్ర మంత్రి డ్రోన్ ద్వారా మందుల పిచికారిని పరిశీలించారు. చామంతి తోటను సందర్శించారు. సహజ పద్ధతిలో తయారు చేసిన ఘన జీవామృతం, ప్రకృతివ్యవసాయ పద్ధతిలో పండిస్తున్న ముల్లంగి పంటను పరిశీలించారు.

మహిళలు పారిశ్రామికవేత్తలు కావాలి

స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని మంత్రి తెలిపారు. జమ్మలమడుగు మండలం మోరగుడి గ్రామంలో ఆయన స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశమయ్యారు. ప్రతి మండలంలో చురుగ్గా ఉన్న ఎస్‌హెచ్‌జీ గ్రూపులను గుర్తించి వారిని ఈ-కామర్స్ బిజినెస్‌లోకి అడుగులు వేసేందుకు ప్రోత్సహిస్తున్నామన్నారు. అవసరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు శిక్షణ కూడా ఇస్తామన్నారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌జీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న సెంట్రల్ కిచెన్ నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

▶▶ గండికోట సందర్శన

జిల్లాలో ప్రముఖ పర్యాటక ప్రదేశమైన గండికోటను కేంద్ర మంత్రి సందర్శించారు. అక్కడి గాడ్జి, ఇతర చారిత్రక కట్టడాలను సందర్శించారు. గండికోట అభివృద్ధికి చేపడుతున్న చర్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, కేంద్ర మంత్రి పీఏ పంకజ్ దీక్షిత్, పీఐబీ డైరెక్టర్ నందకిశోర్‌రెడ్డి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హనుమనుగుత్తిలో ఘర్షణ



వైఎస్సార్‌సీపీ కార్యకర్త పుల్లయ్యను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని హనుమనుగుత్తి గ్రామం ఎస్సీ కాలనీలో బుధవారం రాత్రి జరిగిన ఘర్షణలో దేవగుడి పుల్లయ్య, సుమంత్ అనే రెండు వర్గాల పైన కేసులు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నరేష్‌బాబు గురువారం తెలిపారు. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన రెండు వర్గాల వారు పాత కక్షల కారణంగా ఘర్షణ పడ్డారు. దీంతో రెండు వర్గాలపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టరు సుధీర్‌రెడ్డి ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త పుల్లయ్యను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, వారికి భరోసా ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

సిద్దవటం : మండల పరిధి భాకరాపేట గ్రామ సమీపంలోని రాజస్తాన్ డాబా వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దవటం మండలం మోదీన్‌సాబ్‌పల్లె గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంలో గురువారం రాత్రి కడప నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. భాకరాపేట గ్రామ సమీపంలోని రాజస్తాన్ డాబా వద్దకు రాగానే ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన లక్ష్మీనారాయణను వైద్య కోసం 108 వాహనంలో కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

గాయపడిన వ్యక్తి మృతి

కడప అర్బన్ : కడప నగరంలోని అక్కాయపల్లి వద్ద స్కూటర్‌పై వెళుతూ ఈ నెల 1వ తేదీన రాత్రి షేక్ అర్షద్ ఆలీ (58) అనే వ్యక్తి అదుపు తప్పి కింద పడటంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. రిమ్స్‌కు తీసుకెళ్లిన తరువాత అక్కడ అతను మృతి చెందాడు. శాస్త్రినగర్‌కు చెందిన షేక్ అర్షద్ ఆలీ ఆర్టీసీ కడప గ్యారేజీలో డిప్యూటీ మెకానిక్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయనకు ఇద్దరు కుమారులు, కుటుంబ సభ్యులు వున్నారు. తన ఇంటికి వెళుతున్న సమయంలో అదుపుతప్పి కింద పడటంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. అతన్ని వెంటనే రిమ్స్‌కు తీసుకెళ్లారు. మృతుడి కుమారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ వెంకటేష్ తెలియజేశారు.

జాతీయ సైన్స్ కాంగ్రెస్ పోటీలకు ఎంపిక

– కౌశిక్‌రెడ్డిని అభినందించిన విద్యాశాఖ కమిషనర్



కౌశిక్‌రెడ్డిని అభినందిస్తున్న విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు

కలసపాడు : మండలంలోని బ్రహ్మణపల్లె గ్రామానికి చెందిన మాజీ సమాచార కమిషనర్, హైకోర్టు న్యాయవాది కాకర్ల చెన్నారెడ్డి కుమారుడు కౌశిక్‌రెడ్డిని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు అభినందించారు. గతేడాది విజయవాడలో జరిగిన జాతీయ సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో కౌశిక్‌రెడ్డి రాష్ట్రస్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. కర్నూలు అతీనా పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కౌశిక్‌రెడ్డి దివ్యాంగులకు అవసరమైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పర్యావరణ, ఆరోగ్యకరమైన మ్యూజికల్ వీల్‌చైర్‌ను రూపొందించారు. ఈ నెల 3వ తేదీ నుంచి 6వ తేదీ వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్‌లో 31వ జాతీయ సైన్స్ కాంగ్రెస్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో మన దేశంలోని వివిధ రాష్ట్రాల విద్యార్థులతో పాటు బెహరాన్, ఖతర్, సౌదీఅరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ తదితర దేశాల విద్యార్థులు పాల్గొననున్నారు. కౌశిక్‌రెడ్డి రూపొందించిన మ్యూజికల్ వీల్‌చైర్‌ను సైన్స్ కాంగ్రెస్‌లో ప్రదర్శించనున్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యా కమిషనర్ కౌశిక్‌రెడ్డిని అభినందించారు. కౌశిక్‌రెడ్డిని తల్లిదండ్రులు చెన్నారెడ్డి, నిర్మలాదేవి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ఆగిన చదువు సాగేలా.. అందలానికి చేరేలా..

చదువును మధ్యలో మానేసిన, ఉత్తీర్ణులు కాలేకపోయిన వారి విద్యాసక్తి నెరవేర్చేందుకు.. దూర విద్యా విధానం (ఓపెన్ స్కూల్) ఉపయోగకరంగా ఉంటోంది. ఈ విధానంలో ఉన్నత చదువులు చదివి.. జీవితంలో స్థిరపడిన వారు ఎంతో మంది ఉన్నారు. 14 ఏళ్ల వయసు ఉన్న వారు నేరుగా పదో తరగతిలో చేరవచ్చు. తర్వాత ఇంటర్‌నూ ఇదే విధానంలో చదవచ్చు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యా శాఖాధికారులు తెలుపుతున్నారు.

- ఓపెన్ స్కూల్‌లో కొనసాగుతున్న అడ్మిషన్లు
- ఫీజు చెల్లింపునకు తత్కాల్‌తో 10 వరకు అవకాశం



ఓపెన్ స్కూల్‌లో ఇంటర్ అభ్యాసకులు

కడప ఎడ్యుకేషన్ : పలు కారణాల వల్ల చదువు దూరమై.. చదవాలనే ఆకాంక్ష ఉన్న వారికి ఓపెన్ స్కూల్ ఒక వరం. అలాంటి వారు పదో తరగతి, ఇంటర్ పూర్తి చేసేందుకు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఏపీ ఓపెన్ స్కూల్) ద్వారా ప్రభుత్వం సువర్ణావకాశం కల్పించింది. అయితే అడ్మిషన్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకుని ఇంకా ఫీజు చెల్లించని వారికి.. మరో అవకాశం కల్పించింది. తత్కాల్‌లో జనవరి 10వ తేదీ వరకు చెల్లించేందుకు గడువు ఇచ్చింది.

ఎలాంటి ఉద్యోగాలకైనా అర్హత

ఓపెన్ స్కూల్ ద్వారా వచ్చే ఈ సర్టిఫికెట్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు ఉంది. వీరు ఎలాంటి ఉద్యోగానికైనా అర్హులే. చదువుపై ఆసక్తి ఉన్న పలువురు ఓపెన్ స్కూల్ ద్వారా పది, ఇంటర్ పూర్తి చేసి ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. అభ్యాసకులకు విద్యను మరింత చేరువ చేసేలా ప్రభుత్వం నెలకు 5 తరగతులు అంటే ప్రతి ఆదివారంతోపాటు రెండవ శనివారం తరగతులు నిర్వహిస్తోంది. ఇలా ఏడాదికి 30 తరగతులు నిర్వహిస్తారు.

టెన్త్‌కు 40.. ఇంటర్‌కు 51 కేంద్రాలు

జిల్లాలో పదో తరగతికి 40, ఇంటర్మీడియెట్‌కు 51 అధ్యయన కేంద్రాలు ఉన్నాయని ఓపెన్ స్కూల్ సిబ్బంది తెలిపారు. పదో తరగతిలో 100 మందికి, ఇంటర్‌లో నాన్ సైన్సుల్లో 40, సైన్స్‌లో 100 మందికి అవకాశం ఉంది. అడ్మిషన్ పొంది నంబర్ వచ్చిన వెంటనే స్టడీ మెటీరియల్ అందించడం జరుగుతుంది. పదో తరగతితోపాటు ఇంటర్‌లో ఆర్ట్స్ గ్రూపులైన హెచ్ఈసీ, సీఈసీ, సైన్సు గ్రూపులైన ఎంపీపీ, బైపీపీ, ఎంబైపీసీ, ఎంఈసీలో ప్రవేశాలు పొందవచ్చు. ఈ సర్టిఫికెట్లు ఉన్నత చదువులకు, ఉద్యోగాలకు, పదోన్నతులకు ఉపయోగపడుతున్నాయి.

అర్హతలు

ఎస్ఎస్‌సీ కోర్సులో చేరేందుకు ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీ నాటికి 14 ఏళ్ల వయసు నిండి ఉండాలి. గరిష్ట వయో పరిమితి ఉండదు. చదవడం, రాయడం తెలిసి ఉండాలి. దరఖాస్తుతోపాటు టీసీ, రికార్డు షీటు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, ఇంటర్‌కు 10వ తరగతి మార్కుల జాబితా, ఎస్ఎస్‌సీ టీసీని దరఖాస్తుతోపాటు అందజేయాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థుల కులధ్రువీకరణ పత్రం, దివ్యాంగులు ధ్రువీకరణ పత్రాన్ని అందజేయాల్సి ఉంటుంది.

నేటికీ రాని పాఠ్యపుస్తకాలు

అభ్యాసకులు ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్ పొంది నంబర్ క్రియేట్ కాగానే.. ఆ నంబర్ ఆధారంగా అభ్యాసకుడికి గత ప్రభుత్వంలో నేరుగా పాఠ్య పుస్తకాలు అందేవి. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత.. అభ్యాసకులకు ఒక్క పాఠ్యపుస్తకం కూడా అందలేదు. దీంతో అభ్యాసకులు తరగతులకు వెళ్లినా పుస్తకాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా పది, ఇంటర్‌కు కలిపి 7 వేల మందికి పైగా అభ్యాసకులు ఉన్నారు. వీరిలో ఒక్కొక్కరికి మీడియం వారిగా 10వ తరగతికి 5 పాఠ్యపుస్తకాలు, ఇంటర్‌కు 5 పాఠ్యపుస్తకాలు అందాల్సి ఉంది. కానీ నేటికి ఒక్క పాఠ్యపుస్తకం కూడా అందలేదని అభ్యాసకులు తెలిపారు. దీనికితోడు కొన్ని అధ్యయన కేంద్రాల్లో పాఠ్య పుస్తకాలు లేని కారణంగా తరగతులను కూడా సక్రమంగా నిర్వహించడం లేదని వారు వాపోతున్నారు. ఓపెన్ స్కూల్ పరీక్షలను కూడా ఈ ఏడాది రెగ్యులర్ పది, ఇంటర్ విద్యార్థులతోపాటు నిర్వహిస్తారని అంటున్నారు. అంటే పరీక్షలకు కేవలం పదో తరగతికి రెండున్నర నెలలు, ఇంటర్‌కు రెండు నెలలు మాత్రమే గడువు ఉందని, ఇప్పటికీ పాఠ్యపుస్తకాలు అందకపోతే మేము ఏమి చదువు కోవాలి, పరీక్షల్లో ఏమి రాయాలని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. దీనికి ప్రభుత్వమే సమాధానం చెప్పాలంటున్నారు.

పాఠ్యపుస్తకాలు త్వరగా సరఫరా చేయాలి



ఇంటర్‌లో అడ్మిషన్ తీసుకుని చాలా రోజులైంది. నేటికి కూడా పాఠ్యపుస్తకాలు రాలేదు. దీంతో స్టడీ క్లాసులకు పోవాలన్నా, చదువుకోవాలన్నా చాలా ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం స్పందించి పాఠ్యపుస్తకాలను త్వరగా సరఫరా చేయాలి.

– లక్ష్మి బ్రహ్మేశ్వరి, ఇంటర్ అభ్యాసకురాలు

అస్తవ్యస్తంగా తరగతులు



అధ్యయన కేంద్రాల్లో గతంలో ఆదివారాలతో పాటు రెండవ శనివారం తరగతులు నిర్వహించేవారు. ఇప్పుడు అలా కాకుండా ఎప్పుడు సెలవు వస్తే.. అప్పుడు తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో రావాలంటే కష్టంగా ఉంది. ఆదివారంతోపాటు రెండవ శనివారం తరగతులు నిర్వహిస్తే మేలు. వచ్చేందుకు వీలవుతుంది.

– నిఖిలేష్‌రెడ్డి, అభ్యాసకుడు

త్వరలో పాఠ్యపుస్తకాలు



ఓపెన్ పది, ఇంటర్‌కు సంబంధించి అడ్మిషన్ పొందిన అభ్యాసకులకు త్వరలో పాఠ్యపుస్తకాలు అందనున్నాయి. ఇందుకు సంబంధించిన అభ్యాసకుల వివరాలను సార్వత్రిక విద్యాపీఠం వారు తీసుకున్నారు. వీలైనంత త్వరలో అభ్యాసకులకే నేరుగా పాఠ్యపుస్తకాలు చేరిపోతాయి. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– మీనాక్షి, జిల్లా విద్యాశాఖ అధికారి

కువైట్‌లో వేంపల్లె వాసి మృతి



శివ కుమార్ (ఫైల్)

వేంపల్లె : కుటుంబాన్ని పోషించుకునేందుకు కువైట్ వెళ్లిన వేంపల్లె వాసి.. అక్కడే గుండె పోటుతో మృతి చెందాడు. మృతుడి బంధువుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వేంపల్లె పట్టణం శ్రీరామ్‌నగర్ గుట్ట వీధికి చెందిన సగినాల శివకుమార్ జీవనోపాధి కోసం కువైట్ వెళ్లారు. ఆయన 18 ఏళ్ల క్రితం చక్రాయపేట మండలం అద్దాలమర్రి గ్రామానికి చెందిన సుభాషిణిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. అతని పెద్ద కుమారుడు సాయి కుమార్ పదవ తరగతి, చిన్న కుమారుడు లోషన్ ఆరవ తరగతి చదువుతున్నాడు. శివకుమార్ 8 ఏళ్ల క్రితం కువైట్ దేశానికి వెళ్లి అక్కడ డ్రైవర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మూడేళ్లకొకసారి ఇండియాకు వచ్చి కువైట్‌కు వెళుతుండేవాడు. రెండు నెలల క్రితం శివకుమార్ కువైట్ నుంచి వచ్చి భార్యాపిల్లలను చూసుకుని తిరిగి కువైట్ వెళ్లాడు. నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం ఉదయం శివకుమార్ కువైట్ నుంచి భార్య సుభాషిణితో మాట్లాడాడు. ఆ తర్వాత శివకుమార్ మధ్యాహ్నం భోజనానికి రాలేదని, షేట్ అక్కడున్న వారిని గది వద్దకు వెళ్లి చూడాలని కోరారు. అతని గది వద్దకు వెళ్లి పిలిచినా పలకపోవడంతో తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్ల చూడగా మంచంలో నిద్రపోతున్నట్లు ఉండగా, పలకరించినా పలకకపోవడంతో హాస్పిటల్‌కు తరలించారు. అప్పటికే గుండె పోటుతో మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు కువైట్ నుంచి సమాచారం వచ్చినట్లు బంధువులు తెలిపారు. ఫోన్‌లో మాట్లాడిన వ్యక్తి కొన్ని గంటల్లోనే గుండె పోటుతో మృతి చెందడంతో భార్యాపిల్లలు కన్నీరుమున్నీరుగా విలపించారు. కువైట్‌లో మృతుడి బంధువులు ఉండడంతో మృతదేహాన్ని వేంపల్లెకు తీసుకొస్తున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

డీఏవీ 'భారతి' విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పరిశ్రమ ప్రతినిధులు

కమలాపురం : మండలంలోని నల్లింగాయపల్లెలో వెలసిన భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (బీసీసీపీఎల్)లోని డీఏవీ భారతి విద్యా మందిర్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ కిషోర్ కుమార్ తెలిపారు. గురువారం స్థానిక డీఏవీ భారతి విద్యా మందిర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారుల వివరాలు తెలియజేశారు. ఇటీవల కడప జెడ్పీహెచ్ఎస్ గాంధీ నగర్ పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ జూనియర్స్ బాలికల క్రీడా విభాగంలో డీఏవీ భారతికి చెందిన ఎ.సాయి హర్షిత ప్రతిభను చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. హర్షిత ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు కర్నూలు జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొంటుందని వివరించారు. అలాగే ఇటీవల ప్రొద్దుటూరులో నిర్వహించిన జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ 2 కేఎం పరుగు పందెంలో డీఏవీ భారతి విద్యార్థి చంద్ర ఓబుల్ రెడ్డి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచాడన్నారు. ఈ నెల 5వ తేదీన తూర్పుగోదావరి జిల్లా తణుకులో జరిగే రాష్ట్ర స్థాయి దూరపు పరుగు పందెం (క్రాస్ కంట్రీ) పోటీలలో అతడు పాల్గొంటాడని వివరించారు. పరిశ్రమ సీఎంఓ సాయి రమేష్, హెచ్ఆర్ అడ్మిన్ గోపాల్‌రెడ్డి, చీఫ్ మేనేజర్ ఐఅండ్‌పీఆర్ భార్గవ్ రెడ్డి, డీఏవీ ప్రాంతీయ అధికారి శేషాద్రి విజేతలుగా నిలిచిన హర్ష, చంద్ర ఓబుల్‌రెడ్డితోపాటు పీడీ చందును అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో సైతం రాణించాలని వారు విద్యార్థులను సూచించారు. ప్రిన్సిపల్ కిషోర్ కుమార్ మాట్లాడుతూ తమ డీఏవీ భారతి స్కూల్ విద్యార్థులు ఏ ఈవెంట్‌లో పాల్గొన్నా సత్తా చాటుతున్నారని కొనియాడారు. ప్రతి ఈవెంట్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలవడం తమ విద్యార్థుల ప్రత్యేకత అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు కూడా ప్రస్తుతం జరిగే పోటీలలో రాణిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

మాజీ ఎమ్మెల్యే స్థలం అక్రమ రిజిస్ట్రేషన్

- నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్
- సహకరించిన ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు
- న్యాయం చేయాలని పాణ్యం యర్రమునిరెడ్డి కుటుంబీకుల వేడుకోలు



అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్న తమ స్థలాన్ని చూపుతున్న మాజీ కౌన్సిలర్ శౌరి సుభాష్‌రెడ్డి

ప్రొద్దుటూరు : సాదా సీదా వ్యక్తులవే కాకుండా ఏకంగా ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే పాణ్యం యర్రమునిరెడ్డికి చెందిన స్థలాన్ని.. నకిలీ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేయించుకున్న సంఘటన చోటు చేసుకుంది. ఈ స్థలం విలువ సుమారు రూ.2 కోట్లు ఉంటుందని అంచనా. ఈ స్థలం రిజిస్ట్రేషన్‌కు గతంలో పని చేసిన సబ్ రిజిస్ట్రార్లు వి.రామలక్ష్మీదేవి, జి.వెంకటరత్నమ్మ సహకరించినట్లు తెలుస్తోంది. విచారణ చేసి నిందితులపై చర్యలు తీసుకోవడంతోపాటు తనకు న్యాయం చేయాలని మాజీ ఎమ్మెల్యే కుటుంబీకులు కోరుతున్నారు.

గోపవరం గ్రామ పంచాయతీలో..

ప్రొద్దుటూరు ప్రాంతంలో పాణ్యం యర్రమునిరెడ్డి పేరు తెలియని వారు ఉండరు. ఆయన 1947, 1956, 1967లలో మూడు మార్లు ప్రొద్దుటూరు మున్సిపల్ చైర్‌పర్సన్‌గా, తర్వాత ఎమ్మెల్యేగా పని చేశారు. పాణ్యం యర్రమునిరెడ్డి మండల పరిధిలోని గోపవరం గ్రామ పంచాయతీకి సంబంధించి కాలువ కట్టన ఉన్న సర్వే నంబర్లు 253, 255, 256, 257, 258, 393లలో సుమారు 36 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. 1942 జూన్ 1న కూరం కృష్ణమాచార్యుల వద్ద నుంచి ఈ భూమిని కొన్నారు. సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం రికార్డుల్లో డీ నంబర్ 2999/1942లో వివరాలు ఉన్నాయి. పాణ్యం యర్రమునిరెడ్డి మరణానంతరం ఆయన ఏకైక కుమార్తె సుబ్బమ్మకు వారసత్వ రీత్యా ఈ భూమి వచ్చింది. ఆమె కుమారులు నలుగురికి ఈ భూములను కేటాయించారు. కాలక్రమేణా ఈ భూములు ప్రస్తుతం ఇంటి స్థలాలుగా మారి రియల్ ఎస్టేట్ వ్యాపారం జరుగుతోంది.

స్థలాన్ని చదును చేసే యత్నం

ఎలాంటి హక్కు, అనుభవం లేకున్నా కొందరు వ్యక్తులు కనీసం పొజిషన్ సర్టిఫికెట్ కాకుండా.. పొజిషన్ సర్టిఫికెట్ దరఖాస్తు ఫారంను నకిలీది తయారు చేసి అందులో తహసీల్దార్ సంతకం సీల్ వేసి ఈ స్థలాలను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. డాక్యుమెంట్ రైటర్ అబ్దుల్ అజీస్ ద్వారా డాక్యుమెంట్ రాయించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు ఉంది. పాణ్యం యర్రమునిరెడ్డికి చెందిన స్థలంలో ఒక్కొక్కరు 2 సెంట్ల చొప్పున మొత్తం 13 మంది 26 సెంట్లను బోగస్ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. రికార్డులను పకడ్బందీగా తయారు చేసుకోవాలనే ఉద్దేశంతో.. వీరు తిరిగి తమ కుటుంబ సభ్యుల పేరుతో రిజిస్ట్రేషన్ చేయించారు. వాస్తవానికి స్థల యజమానులకు ఈ విషయం తెలియదు. ఆ దారిన వెళుతున్న కొందరు స్థలాన్ని చదును చేసేందుకు రాగా.. ఈ స్థలం పాణ్యం యర్రమునిరెడ్డి కుటుంబీకులదని, వారు ఎవరికి అమ్మలేదని అభ్యంతరం తెలిపారు. అదే విషయాన్ని ఆ కుటుంబ సభ్యులకు తెలపడంతో అవాక్కయ్యారు. సబ్ రిజిస్ట్రార్, తహసీల్దార్ కార్యాలయాలకు వారు వెళ్లి పరిశీలించారు.

పోలీసులకు ఫిర్యాదు చేసినా..

ఈ స్థలానికి సంబంధించి ఎలాంటి పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వలేదని తహసీల్దార్ లిఖిత పూర్వకంగా పాణ్యం యర్రమునిరెడ్డి కుటుంబీలకు ఇచ్చారు. అసలు విషయం బయటికి పొక్కడంతో.. స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్న కొంత మంది మాత్రం రద్దు చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరికొందరు మాత్రం ససేమిరా తాము స్థలాన్ని ఇవ్వబోమని, నారుగండ్ల కొండయ్యకు డబ్బు ఇచ్చి కొనుగోలు చేశామని తెలిపారు. ఇదే విషయంపై పాణ్యం యర్రమునిరెడ్డి మనవడు, మాజీ కౌన్సిలర్ శౌరి సుభాష్‌రెడ్డి ప్రొద్దుటూరు రూరల్ పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అక్రమంగా తమ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని పలు మార్లు పోలీసులను ఆశ్రయించారు. అయితే ఇంత వరకు నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

ముడుపులు తీసుకుని..

2023 జూలై, ఆగస్టు నెలలో నారుగండ్ల కొండయ్య సూపర్ బజార్ రోడ్డులో అదే ఇంటిలో నివసిస్తున్న తన కుమారుడైన సుదర్శన్ యాదవ్‌కు, భగత్ సింగ్ కాలనీకి చెందిన కేశినేని లక్ష్మయ్య, అదే ఇంటిలో నివసిస్తున్న సిద్ధమ్మగారి కామేశ్వర్ రెడ్డికి, కల్లూరు గ్రామానికి చెందిన సంగటి ఓబులేసు, అదే గ్రామంలోని తప్పెట వెంకటేశ్వర్లుకు, దువ్వూరు మండలం వెంకులపల్లె గ్రామానికి చెందిన జెర్రి పెద్ద సుబ్బరాయుడు తన కుమార్తె జెర్రి హిమబిందుకు స్థలాలను రిజిస్ట్రేషన్ చేయించారు. అప్పట్లో సబ్ రిజిస్ట్రార్లు వి.రామలక్ష్మీదేవి, జి.వెంకటరత్నమ్మ ముడుపులు తీసుకుని ఈ రిజిస్ట్రేషన్లు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం రామలక్ష్మీదేవి కర్నూలు జిల్లా పత్తికొండలో పని చేస్తూ డిసెంబర్ నెలాఖరున పదవీ విరమణ చెందారు. వెంకటరత్నమ్మ ముద్దనూరు సబ్‌రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

ప్రమాదాల నివారణపై దృష్టి సారించాలి

- కడప–రేణిగుంట హైవే నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం
- రాజ్యసభ సభ్యుడు మేడారఘునాథరెడ్డి



రాజంపేట : జాతీయ రహదారుల్లో జరిగే ప్రమాదాల నివారణపై కేంద్ర రహదారుల మంత్రిత్వశాఖ ప్రత్యేక దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ దేశంలో రహదారి ప్రమాదాల వల్ల అనేక మంది మృత్యువాత పడుతున్నారని, చాలా మంది వికలాంగులుగా మారుతున్నారని, పరోక్షంగా అనేక కుటుంబాలు ఛిద్రమవుతున్నాయన్నారు. ప్రధానంగా రహదారి భద్రత అవసరమన్నారు. కేంద్ర ప్రభుత్వం నేషనల్ రోడ్ సేఫ్టీ మంత్(ఎన్ఆర్ఎస్ఐ) కార్యక్రమాన్ని జనవరి 1 నుంచి 31 వరకు నిర్వహిస్తోందని, అందరి భాగస్వామ్యంతో అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సడక్ సురక్ష అభియాన్ కార్యక్రమాన్ని తెరపైకి తీసుకొచ్చిందన్నారు.

కడప–రేణిగుంట హైవే నిర్మాణ పనులపై కేంద్రమంత్రి హామీ

కడప–రేణిగుంట హైవే నిర్మాణ పనులపై కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరి హామీ ఇచ్చారని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి తెలిపారు. ఇటీవల తాను, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డిలు కేంద్రమంత్రిని కలిసి కడప–రేణిగుంట హైవే నిర్మాణం జాప్యం కొనసాగుతోందని, త్వరగా పనులు చేపట్టాలని కోరామన్నారు. ఇందుకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని వివరించారు. పనులు త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి తమకు హామీ ఇచ్చారన్నారు. అలాగే అటవీ పర్యావరణ అనుమతులు ఆలస్యం అవుతుండటంతో కేంద్రమంత్రి భూపేంద్రయాదవ్‌ను కూడా కలిసి అనుమతులు త్వరగా మంజూరు చేయాలని కోరామన్నారు. ఇప్పటికే అటవీ శాఖ అనుమతులు ఇచ్చారన్నారు. పర్యావరణ అనుమతులు కూడా త్వరలో ఇచ్చేందుకు అవసరమైన ప్రక్రియ పూర్తి చేస్తామని చెప్పారు. కాగా కడప–రేణిగుంట జాతీయరహదారి (పాతరోడ్డు)చాలా అధ్వానంగా ఉందని.. పెద్ద, చిన్న గుంతలను పూడ్చాల్సిన బాధ్యత ఎన్‌హెచ్ఏఐకి ఉందని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఎంపీ రఘునాథరెడ్డి హితువు పలికారు.

భర్త మందలించాడని భార్య ఆత్మహత్య



మృతి చెందిన సాకే నేత్ర

ఎర్రగుంట్ల : తుమ్మలపల్లెకు చెందిన సాకే నేత్ర (18) భర్త మందలించాడని ఆత్మహత్య చేసుకుంది. ఎర్రగుంట్ల పట్టణ సీఐ నరేష్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురానికి చెందిన అంజనమ్మ కుమార్తె సాకే నేత్రకి ఎర్రగుంట్ల మండలంలోని తుమ్మలపల్లి గ్రామానికి చెందిన నాగరాజుకు రెండేళ్ల కిందట వివాహం అయింది. వీరికి ఏడాది పాప ఉన్నారు. ఇంటిలో ఉన్న రూ.50 వేలలో రూ.5 వేలు కన్పించకపోవడంతో భర్త ఆమెను మందలించాడు. మనస్తాపానికి గురైన ఆమె బుధవారం రాత్రి ఇంటిలో ఉరివేసుకుంది. వెంటనే భర్తతోపాటు స్థానికులు ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రి తరలించగా అక్కడ మృతి చెందిందని సీఐ తెలిపారు. మృతురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వైవీయూకు ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికెట్



ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికెట్‌ను ప్రదర్శిస్తున్న వైవీయూ అధికారులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలోని వసతి గృహాల్లో నాణ్యమైన భోజన, ఆహార పదార్థాలు విద్యార్థులకు ఇస్తున్నట్లు గుర్తించి ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) సర్టిఫికెట్ లభించింది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ పుత్తా పద్మ సమక్షంలో పీజీ కళాశాల ప్రిన్సిపాల్, విశ్వవిద్యాలయ వసతి గృహాల చీఫ్ వార్డెన్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డికి ఆంధ్రప్రదేశ్ రూకో ప్రాజెక్ట్ హెడ్ అల్లూరి సంపత్ కుమార్ ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సంపత్ కుమార్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ వసతి గృహాల్లో లభించే ఆహార పదార్థాలను ఆకస్మికంగా పరిశీలన చేసినప్పుడు నిపుణులు నాణ్యతా ప్రమాణాలను గుర్తించారన్నారు. భవిష్యత్తులో ఈ సర్టిఫికెట్ ఇలానే కొనసాగించాలంటే నిత్యం అప్రమత్తంగా, నాణ్యత ప్రమాణాలతో కూడిన ప్యాకెట్ ప్రొడక్ట్‌ను వినియోగించాలని సూచించారు. అధికారులు, వార్డెన్ల నిత్య పర్యవేక్షణ అవసరమని తెలిపారు. వైస్ చాన్సలర్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని పెన్నా, పాపాగ్ని, చిత్రావతి, చెయ్యేరు మెస్సులకు ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికెట్ రావడం సంతోషదాయకమన్నారు. చీఫ్ వార్డెన్, వసతి గృహ సంక్షేమ అధికారులు మరింత దృష్టి సారించాలని కోరారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. ఈ సమావేశంలో ఐక్యూఏసీ డైరెక్టర్ ఎల్.సుబ్రహ్మణ్యం శర్మ, సహాయ డైరెక్టర్ సుభోష్ చంద్ర, పీఆర్ సెల్ సంచాలకులు పి.సరిత, వార్డెన్లు డాక్టర్ సతీష్ బాబు, మెర్సీ విజేత, సునీత, రాఘవేంద్ర, రామమనోహర్‌రెడ్డి, వరప్రభాకర్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.